అక్రమ నిర్మాణాల తొలగింపు

ఖని కూరగాయల మార్కెట్ వద్ద టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించిన అక్రమ నిర్మాణం

'నమస్తే' కథనానికి స్పందన

కోల్‌సిటీ, డిసెంబర్ 20: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై నగర పాలక పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు కొరడా ఝుళిపించారు. 31వ డివిజన్ పరిధిలోని ప్రధాన కూరగాయల మార్కెట్‌లో మాంసం దుకాణాల పక్కన ఖాళీగా ఉన్న స్థలంలో ప్రైవేట్ వ్యక్తి నిర్మించిన షెడ్‌పై మంగళవారం నమస్తే తెలంగాణ దిన పత్రికలో 'రాత్రికి రాత్రే వెలసిన షెడ్డు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ మేరకు బుధవారం నగర పాలక కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు విచారణ జరిపి పొక్లయిన్ సాయంతో షెడ్డును కూల్చివేశారు. అలాగే నగరంలోని పలు చోట్ల అనుమతులు లేని హోర్డింగ్‌లను తొలిగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పాలక పరిధిలో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే స్థానికులు కార్యాలయంలో సమాచారం అందించాలని, అక్రమ నిర్మాణాలు చేపట్టే వ్యక్తులు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు చేపడుతామని స్పష్టం చేశారు.

కోల్ ఇండియా కన్నా భిన్నంగా హక్కుల సాధన

- సమ్మె సంస్కృతికి చరమ గీతం
- టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి

మాట్లాడుతున్న టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి

యైటింక్లయిన్ కాలనీ, డిసెంబర్ 20 : కోల్ ఇండియా కన్నా భిన్నంగా సింగరేణిలో హక్కులు సాధించామని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆర్జీ-2 పరిధిలోని ఓసీపీ-3 ప్రాజెక్ట్ ఎస్అండ్‌డీ సెక్షన్ గేట్ మీటింగులో ఆయన మాట్లాడారు. సింగరేణిలో సమ్మె సంస్కృతికి చరమగీతం పాడి శాంతియుతంగా యాజమాన్యంతో చర్చించి 60కి పైగా హక్కులు సాధించామని గుర్తు చేశారు. కోల్ ఇండియాలో అమలుకానీ 18కి పైగా హక్కులు సింగరేణిలోఅమలు చేయించామన్నారు.12వేల వారసత్వ ఉద్యోగాలు, 4,800 నూతన ఉద్యోగాలతోపాటు 600 మంది డిస్మిస్ కార్మికులకు ఉద్యోగ అవకాశం కల్పించిన ఘనత టీబీజీకేఎస్‌దేనని స్పష్టం చేశారు. ఈ నెల 27న జరిగే సింగరేణి ఎన్నికల్లో టీబీజీకేఎస్‌ని ఆదరించి మరోసారి అవకాశమిస్తే మరిన్ని హక్కులు సాధిస్తామని తెలిపారు. నాయకులు అటుకుల రవీందర్ రెడ్డి, చంద్రమౌళి, ముస్కుల అనిల్‌రెడ్డి, దాసరి శ్రీనివాస్, రాజమౌళి, లింగారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కొప్పుల శ్రీనివాస్, నర్సింహులు, బొడ్డు రమేశ్, ప్రవీణ్, రాజేశం పాల్గొన్నారు.

ట్రినిటీలో ఫ్రెషర్స్ డే సందడి

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 20 : పెద్దపల్లి ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఎంబీఏ విద్యార్థుల ఫ్రెషర్స్ డే 2కే23ని విద్యాసంస్థల ఫౌండర్ దాసరి మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులు ఏ ఒక్కరూ ఖాళీగా ఉండకూడదనే ఉద్దేశంతో రానున్న రోజుల్లో మెగా జాబ్‌మేళా నిర్వహించి, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తు న్నట్లు తెలిపారు. కొన్ని నెలలుగా ఎంబీఏ విద్యార్థులకు ఫీల్డ్ ట్రిప్, ఇండస్ట్రీయల్ విజిట్, గ్రూప్ డిస్కషన్, డిబేట్స్, సెమినార్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లో సాంకేతికపరంగా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మణి గణేషన్, ఏవో సురేశ్, రాజిరెడ్డి, డాక్టర్ ఆరిఫ్, డాక్టర్ కౌశల్య, రాంమోహన్, శ్రావణి, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

గేటుకు అడ్డంగా కట్టిన గోడ

30 ఏండ్ల దారిని మూసేశారు

రామగిరి, డిసెంబర్ 20: సెంటినరీ కాలనీలోని రాణీరుద్రమదేవి స్టేడియంలోకి వెళ్లే ప్రధాన దారిని అధికారులు మూసివేశారు. స్టేడియంలో స్టేజీ వెనుక వైపు రాంనగర్ నుంచి వచ్చే రహదారికి మధ్యలో చిన్న గేటు ఉంది. ఈ గేటును 30 యేళ్ల క్రితం స్టేడియం నిర్మించినప్పుడు ఏర్పాటు చేశారు. అధికారుల ఆదేశాలతో ఈ గేటుకు అడ్డంగా ప్రహరీని ఆనుకొని గోడ నిర్మించారు. 30 ఏళ్ల నాటి గేటు మూసివే యడంతో మైదానానికి వచ్చే రాంనగర్ వాసులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆ దారిని పునరుద్ధరించాలని సర్పంచ్ పల్లె ప్రతిమా పీవీ రావు, ఎంపీటీసీ ధర్ముల రాజ సంపత్, ఉపసర్పంచ్ దుబ్బాక సత్యరెడ్డి, వార్డు సభ్యులు ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావును కోరారు.

బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

గాయత్రి విద్యానికేతన్‌లో భగవద్గీత పఠన పోటీలు

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 20 : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ (పెద్దపల్లి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గీతా జయంతి మహోత్సవాలు-2023లో భాగంగా పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్‌లో బుధవారం శ్రీమద్భగవద్గీత 3వ అధ్యాయం కర్మయోగం అనే అంశంపై పఠన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్ విభాగంలో కే సాహల్య (ప్రథమ), ఆర్ దివిజ (ద్వితీయ), కే సహల (తృతీయ) బహుమతి, సీనియర్ విభాగంలో కే సహస్ర (ప్రథమ), పీ అభిరామ్ (ద్వితీయ), జీ సాయిదుర హర్షిని (తృతీయ) బహుమతి, ఎన్ హాస్య, కే సిరి ప్రత్యేక బహుమతులు సాధించినట్లు గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ అల్లెంకి రజిని, ప్రిన్సిపాల్ విజయ్, టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ రాంరెడ్డి కృష్ణమూర్తి, టీటీడీ ధర్మాచార్యులు నరెడ్ల సదయ్య, రామ్మోహన్‌రావు, అంజలి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్ 20: కాల్వశ్రీరాంపూర్ సర్పంచ్ ఆడెపు శ్రీదేవి మామ ఆడెపు మండలేశ్వర్ ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు బుధవారం పరామర్శించారు. ఇక్కడ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గొడుగు రాజ్‌కుమార్, కూనారం పీఏసీ చైర్మన్ గజవెల్లి పురుషోత్తం, సర్పంచులు పొన్నమనేని దేవేందర్‌రావు, బుర్ర మంగ సదానందం, ఎల్లస్వామి, బండ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీలు గూడెపు జనార్దన్‌రెడ్డి, మాదాసి సువర్ణా రామచంద్రం ఉన్నారు.

సింగరేణిలో ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేస్తాం

యైటింక్లయిన్ కాలనీ, డిసెంబర్ 20 : సింగరేణిలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయించే బాధ్యత తమదేనని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ భవన్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. సింగరేణిలో శాశ్వత హక్కుల సాధన ఘనత తమదేనన్నారు. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపిస్తే ఉద్యోగులకు ప్రమోషన్, జీతాభత్యాల పెంపు, సొంతింటి కల అమలు, సింగరేణి పాఠశాలలను ఆధునీకరించి సీబీఎస్ విధానం అమలు చేయడతోపాటు కార్మికులపై యాజమాన్యం అలవెన్స్‌పై విధిస్తున్న ఇన్‌కం టాక్స్‌ను యాజమాన్యమే భరించేలా కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో ప్రకాశ్, రాజరత్నం, జిగురు రవీందర్, అన్నారావు, వెంకటేశ్వర్లు, బుర్ర తిరుపతి, కోండ్ర సత్యనారాయణ, మహేందర్, రాజయ్య, రమేశ్, జాడి అంజనేయులు, నసీమొద్దీన్‌ఖాన్, రాజశేఖర్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

సుల్తానాబాద్, డిసెంబర్ 20 : ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ -14 ఖోఖో ఎంపిక పోటీల్లో ఐపీఎస్ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఎస్ శ్వేత, వీ కావ్యశ్రీని బుధవారం పాఠశాల ఆవరణలో అభినందించారు. గురువారం నుంచి ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీలు సత్యం, ఇక్బాల్, శివ ఉన్నారు.

'ఖని'లో రంగోళి పోటీలు

గోదావరిఖని, డిసెంబర్ 20: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జీఎం కార్యాలయ క్రీడా మైదానంలో మహిళలకు దీపాలంకరణతో కూడిన ముగ్గుల పోటీలు జరిగాయి. విజేతలకు ఈ నెల 23న బహుమతులను అందజేయనున్నారు. పోటీలకు ముఖ్య అతిథిగా లేడీస్ క్లబ్ సెక్రటరీ చిలక లక్ష్మీశ్రీనివాస్, మమత, శిరీష, సుజాత, రమ, కవిత, సంక్షేమాధికారి హనుమంతరావు హాజరయ్యారు.

ఆవిర్భావ వేడుకల ఏర్పాట్ల పరిశీలన

ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

రామగిరి, డిసెంబర్ 20: ఈనెల 23న సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రాణీ రుద్రమదేవి స్టేడియంలో నిర్వహించనున్న వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను ఆర్జీ-3 జీఎం ఎస్.సుధాకర్ రావు బుధవారం పరిశీలించారు. క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసే వివిధ రకాల స్టాల్స్, స్టేజ్, గనులకు సంబంధించి స్టాల్స్ తదితర ఏర్పాట్లు ఏలా ఏయాలో అధికారులకు సూచనలు చేశారు. ఈ వేడుకలను కార్మికులు కుటుంబ సమేతంగా వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయన వెంట సేఫ్టీ అధికారి వెంకటరమణ, ప్రాజెక్టు అధికారి రాజేందర్, సివిల్ డీజీఎం పద్మరాజు, పీఎం రవీందర్ రెడ్డి ఇతర అధికారులు ఉన్నారు.

ఉత్తమ గృహాల ఎంపిక

సెంటినరీకాలనీలో ఉత్తమ పర్యావరణ గృహాలను ఎంపిక చేశారు. కమిటీ కన్వీనర్, ఆర్జీ-3 ఎస్‌వోటూ జీఎం రఘుపతి, సభ్యులు కాలనీలోని 15 మంది గృహాల వారు తమ పేర్లను నమోదు చేసుకోగా, బుధవారం ఆ క్వార్టర్లను సందర్శించారు. వివిధ రకాల పూల మొక్కలతో ఇంటి ఆవరణలో పూర్తిగా శుభ్రంగా ఉన్న గృహాలను విద్యు త్ పొదుపుగా వాడటం, నీటిని సద్వినియోగం చేసుకొనే అంశాలను కమిటీ పరిశీలించారు. వీటిలో ఉత్తమ గృహాలుగా ఎంపిక చేసిన వారికి ఈనెల 23న దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పర్యావరణ అధికారి కిషన్, డీవైపీఎం మారుతి, సునీల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు

రామగిరి, డిసెంబర్ 20: ఆర్జీ-3 సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో సేవా సభ్యులు, సింగరేణి గృహిణులు ఉల్లాసంగా.. ఉత్సాహంగా పాల్గొంటున్నారు. బుధవారం ఆర్జీ-3 సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకర్ రావు, కే విజయలక్ష్మీ వెంకటేశ్వర్లు హాజరై పోటీలను ప్రారంభించారు. పలువురు మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో బహుమతులతో సత్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైపీఎం సునీల్ ప్రసాద్, సేవా కార్యదర్శి మల్లేశ్వరి, కార్యదర్శి ఉమాదేవి, ఆర్.లక్ష్మణ్, రాయమల్లు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

సీఐటీయూ ఎన్నికల ప్రచార రథం ప్రారంభం

రామగిరి, డిసెంబర్ 20:ఆర్జీ-3లో సీఐటీయూ ఎన్నికల ప్రచార రథాన్ని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ముత్యం రావు బుధవారం ప్రారంభించారు. ఈ మేరకు ఏఎల్‌పీ గనిపై పిట్ సెక్రటరీ రవికుమార్ అధ్యక్షతన నిర్వహించి గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తూ పరిష్కారానికి కృషి చేస్తున్న సీఐటీయూని కార్మికులు గుర్తించాలని కోరారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, కుమార్, పాషా, ప్రభాకర్, దుర్గా ప్రసాద్, తిరుపతి, రాజేశం, అరవింద్, వెంకటేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని, డిసెంబర్ 20: సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డైరెక్టర్ (పా) బలరాంకు ఐఎఫ్‌టీయూ నాయకులు విన్నవించారు. ఈమేరకు హైదరాబాద్‌లో బుధవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కృష్ణ సింగరేణిలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఇక్కడ మల్లేశ్, నరేశ్ ఉన్నారు.

నాడు : వారం కిందట చెత్త డంప్ యార్డును సందర్శిస్తున్న సభ్యులు

నేడు : బుధవారం యార్డు తరలింపు అనంతరం

ఫలించిన ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ పోరాటం

- గోదావరి నది నుంచి చెత్త డంపింగ్ యార్డు తరలింపు
- నగర పాలక అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన సభ్యులు

కోల్‌సిటీ, డిసెంబర్ 20: గోదావరిఖని శివారు గోదావరి వద్ద చెత్త డంప్‌యార్డును ఇతర ప్రాంతానికి తరలించాలని కొద్ది రోజులుగా ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ సభ్యులు చేస్తున్న ప్రయత్నం ఫలించింది. బుధవారం నగర పాలక సంస్థ అధికారులు డంప్ యార్డును మరో చోటుకు తరలించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. బల్దియాలోని 50 డివిజన్ల నుంచి ప్రతి రోజూ సేకరించే 115 మెట్రిక్ టన్నుల చెత్తను గోదావరి సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద నిల్వ చేయడంతో దుర్వాసనతో పాటు అంటువ్యాధులు ప్రబలుతున్నాయని అదనపు కలెక్టర్ అరుణశ్రీ, సింగరేణి ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, నగర కమిషనర్ నాగేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. స్పందించి చెత్త డంపింగ్ యార్డును తరలించారు. సింగరేణికి చెందిన 10 ఎకరాల స్థలాన్ని కేటాయించినందుకు జీఎంకు మద్దెల దినేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తింపు సంఘం ఎన్నికలను అడ్డుకునే కుట్ర

గోదావరిఖని, డిసెంబర్ 20: సింగరేణిలో కొన్ని యూనియన్‌లు ద్వంద్వ వైఖరి అవలంబిస్తూ ఈ నెల 27న జరిగే ఎన్నికలను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోచం, రంగు శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం ఓసీపీ-5, జీడీకే-2 గనులపై జరిగిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. సింగరేణి గుర్తింపు ఎన్నికలు నిర్వహించేందుకు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ యూనియన్లను ఆహ్వానిస్తే కొన్ని యూనియన్‌లు రాకుండా సింగరేణి భవన్‌కు వెళ్లి డైరెక్టర్‌తో మాట్లాడడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు గౌతం గోవర్ధన్, అశోక్, మాదన మహేశ్, లక్ష్మీనారాయణ, గండి ప్రసాద్, సతీశ్‌బాబు, నాగేందర్, ప్రభుదాస్, రామస్వామి, సోహెల్, ఏలేశ్వరం సత్యనారాయణ, సుధాకర్ ఉన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు వ్యర్థం

మాట్లాడుతున్న ఎస్ఐ రాములు

కమాన్‌పూర్, డిసెంబర్ 20: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ బేతి రాములు అన్నారు. గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పలు అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. పాన్, గుట్కాతో పాటు మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. అలాగే వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడితే వెంటనే 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో రమేశ్‌తోపాటు సిబ్బంది ఉన్నారు.

ఐఎన్టీయూసీని గెలిపించాలి

గోదావరిఖని, డిసెంబర్ 20: సింగరేణిలో ఈనెల 27న జరిగే గుర్తింపు ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీని గెలిపించాలని ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు సదానందం, ఆరెపల్లి శ్రీనివాస్ కోరారు. ఆర్జీ-1 ఎక్స్‌ప్లోరేషన్ డిపార్ట్‌మెంట్, సివిల్ విభాగంలో బుధవారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు మల్లికార్జున్, బూర జగన్, నీరటి సాగర్, ఉడుత నాగరాజు, మహేశ్‌బాబు, ఆంజనేయులు, గణపతి, దామోదర్, అల్లవుద్దీన్, శ్రీనివాస్ ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత

మంథని రూరల్, డిసెంబర్ 20: అడవిసోమన్‌పల్లికి చెందిన సుదారి రామక్కకు రూ. లక్ష విలువైన ఎల్‌వోసీ చెక్కును రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంజూరు చేయించారు. రామక్క అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్‌లో చికిత్స పొందుతుండగా ఆర్థిక సాయం అందించాలని మంత్రి శ్రీధర్‌బాబుకు విన్నవించుకు న్నారు. దీనిపై స్పందించిన మంత్రి సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం మంజూరు చేయించారు. ఎల్‌వోసీని హైదరాబాద్‌లో బుధవారం అందజేశారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

మంథని, డిసెంబర్ 20: శ్రీరాంనగర్‌లోని సీయోను చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను బుధవారం రాత్రి నిర్వహించారు. చర్చి ఆధ్వర్యంలో గ్రామంలోని వాడ వాడలా తిరుగుతూ క్రిస్మస్ క్యారల్స్ నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టర్లు అజ్మీరా దయారాజ్, పెండ్రు ప్రసన్న కుమార్, గద్దల రాజేష్, మంథని మార్క్, సంఘ పెద్దలు అంకరి కుమార్, ఎంకే జోసెఫ్, మంథని ప్రసాద్, చింతకుంట్ల ప్రేమ్ కుమార్, అందే రమేశ్, కామని మల్లారెడ్డి ఉప్పలపాటి జాన్, కన్నూరి రాజేశం పాల్గొన్నారు.

ఆ స్క్రాప్ దొంగలు ఎవరు..?

కోల్‌సిటీ, డిసెంబర్ 20: రామగుండం పాత మున్సిపల్ కార్యాలయం నుంచి అత్యంత విలువైన స్క్రాప్, వాహనాల పరికరాలు మాయం చేసిన ఘటన మళ్లీ తెరపైకి వచ్చింది. ఏడాది కిందట గోదావరిఖని అశోక్‌నగర్‌లో గల పాత మున్సిపల్ కార్యాలయంలో రూ.50లక్షల విలువైన స్క్రాప్‌ను రెండు డీసీఎంల ద్వారా రాత్రికి రాత్రే తరలించిన ఘటన విధితమే. ఆ మరుసటి రోజే ఆ స్క్రాప్ బయటకు రావడంతో అప్పటి కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అప్పటి నగర పాలక కమిషనర్ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి సీఐ రంగంలోకి దిగి పాత మున్సిపల్ కార్యాలయం చుట్టు పక్కల ఇళ్లలో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. ఆ తర్వాత కొద్ది రోజులకు ఘటనను అంద రూ మరిచిపోయారు. రెండు రోజుల క్రితం ప్రస్తుత కమిషనర్ స్క్రాప్ మాయంలో అసలు నిందితులు ఎవరు..? ఎక్కడ అ మ్మారు..? రికవరీ చేశారా? అనే అంశాలపై వివరణ కావాలంటూ వన్ టౌన్ పోలీసులకు మళ్లీ లేఖ రాయడం నగరంలో చర్చనీయాంశమైంది. దీంతో కథ కంచికే అనుకున్న స్క్రాప్ దొంగలు మళ్లీ బెంబేలెత్తిపోతున్నట్లు తెలిసింది.

ఆర్జీ-1 జీఎంకు వినతి

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 20: గోదావరిఖని ప్రధాన చౌరస్తా పోచమ్మ గుడి పక్కన సింగరేణి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి మసీదును ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ బుధవారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు సింగరేణి ఆర్జీ-1 జీఎం, రామగుండం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్, నగర కార్యదర్శి మేడగోని రవీందర్, బజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ ముష్కే సంపత్ యాదవ్, అడిగొప్పుల రాజు, నేరేడుకొమ్మ వెంకటస్వామి, కొండపర్తి లింగన్న, మునగాల సంపత్, ఆరెల్లి జలందర్, కందువుల ఆకాశ్, పొన్నగంటి శశి, శ్రావణ్‌కుమార్, సుధీర్, రాజు, యాది తతదితరులు ఉన్నారు.

సీతంపల్లిలో ప్రభుత్వ భూమి కబ్జా

- నిరసన వ్యక్తం చేసిన సర్పంచ్
- మంత్రి హామీతో విరమణ

ముత్తారం,డిసెంబర్ 20: సీతంపల్లిలో గ్రామానికి ప్రభుత్వ భూమి కేటాయించారు. అందులో శ్మశాన వాటిక, నర్సరీలు ఏర్పాటు చేశామని ఇప్పుడు ఆ భూమిని గ్రామానికి చెందిన అన్నం రాజమల్లు అక్రమంగా దున్ని నాటు వేసేందుకు సిద్ధం కాగా, సర్పంచ్ పులిపాక నగేశ్ పొలం వద్ద బురదలో పడుకొని నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ముత్తారం ఎస్ ఐ మధుసూదన్ రావు, నాయబ్ తహసీల్దార్ ఉదయ్‌కుమార్, గిర్దావర్ శ్రీధర్ అక్కడికి వెళ్లి నిరసన నిలిపివేయాలని సర్పంచ్ ను కోరారు. ఈ భూమి నద్దినాల భూమి అని శ్మశాన వాటిక, నర్సరీ ఏర్పాటు చేశామని.. అక్రమంగా ట్రాక్టర్లతో రాత్రికి రాత్రే దున్ని నాటు వేస్తున్నందున నిరసన వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. కలెక్టర్ వస్తేనే నిరసన విరమిస్తానని స్పష్టం చేశారు. గ్రామస్తులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు తెలుపగా సర్పంచ్‌తో ఫోన్లో మాట్లాడారు. కలెక్టర్, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన అన్నం రాజమల్లు పై కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ నగేశ్ పోలీసు, రెవెన్యూ అధికారులను కోరారు.

మద్యం మత్తులో రౌడీ షీటర్ల గొడవ

- పెద్దపల్లిలోని హోటల్‌లో ఘర్షణ
- ఇటుక, హోటల్ వ్యాపార లావాదేవీలే కారణం!
- పోలీసుల అదుపులో నలుగురు రౌడీషీటర్లు

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 20: పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బుధవారం ఉదయం రంగంపల్లి రుచి గ్రాండ్ హోటల్‌లో నలుగురు రౌడీ షీటర్లు దాసరి ప్రేమ్‌కుమార్‌పై కత్తులతో దాడికి పాల్పడిన ఘటన కలకలం సృష్టించింది. స్థానికుల కథనం మేరకు .. గోదావరిఖని పట్టణానికి చెందిన దాసరి ప్రేమ్‌కుమార్ (రౌడీ షీటర్) కరీంనగర్‌లో నివాముంటున్నాడు. సుల్తానాబాద్ సమీపంలోని పూసాలకు చెందిన రాజు, వంశీ, మరో ఇద్దరు రౌడీ షీటర్లు ఉమ్మడిగా ఇటుక, హోటల్ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇటీవల వ్యాపార లావాదేవీల్లో వివాదం నెలకొంది. దీనిపై మంగళవారం రాత్రి రుచి గ్రాండ్ హోటల్‌లో సమావేశమై చర్చించుకున్నారు. ఈ క్రమంలో దాసరి ప్రేమ్‌కుమార్‌పై రాజు, వంశీ మరో ఇద్దరు కత్తులతో దాడికి పాల్పడారు. తీవ్ర గాయాలైన దాసరి ప్రేమ్‌కుమార్‌ను కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ప్రేమ్‌కుమార్ భార్య రోజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. గొడవకుగల కారణాలు పోలీసులు ధ్రువీకరించలేదు. కాగా దాడి చేసిన రౌడీ షీటర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

బాల్ త్రో పోటీల్లో పాల్గొన్న మహిళలు

మహిళలకు ఆటల పోటీలు

యైటింక్లయిన్ కాలనీ, డిసెంబర్ 20 : సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆర్జీ-2 యాజమాన్యం కార్మిక కుటుంబాల మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలను నిర్వహించింది. అబ్దుల్‌కలామ్ క్రీడా మైదానంలో రన్నింగ్, బాల్‌త్రో, బాంబి ఇన్ సీటీ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 23న బహుమతులు ప్రదానం చేయనున్నారు. అదే విధంగా ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని ఉత్తమ పర్యావరణ గృహాలను ఎంపిక చేసింది. కమిటీ సభ్యులు సురేశ్‌బాబు, ప్రతాపగిరి రాజు, డీవైపీఎం వేణుగోపాల్ కార్మిక గృహాల్లో పర్యటించి ఇంటి పరిసరాలు, మొక్కల పెంపకం, ఇంటి అలంకరణ తదితర వాటిని పరిశీలించి ఉత్తమ గృహాలను ఎంపిక చేశారు. ఇందులో ఎంపికైనా ఉత్తమ గృహాలకు ఆవిర్భావ వేడుకల రోజున బహుమతులు ప్రదానం చేయనున్నారు.